## అనుశాసనపర్వ కథాంశాలు

మహాభారతములోని పదమూడవ పర్వము అనుశాసన పర్వము. ఇందు దానధర్మపర్వము, భీష్మ స్వర్గారోహణ పర్వమని రెండు ఉపపర్వములు, 168 అధ్యాయములు, 9641 శ్లోకములు గలవు.

### 1) దాన ధర్మపర్వము :-

ఈ ఉప పర్వమున 166 అధ్యాయములు గలవు. యుధిష్ఠిరుని ప్రశ్నలకు సమాధానముగా భీష్ముడు అనేక ధర్మములను ఉపదేశించెను. వాటిని విని ధర్మరాజు పితామహా! మీరు శాంతికి సంబంధించి నానావిధతత్త్వములను ఉపదేశించితిరి. అయినను నాకు శాంతి లభించుటలేదు. మిమ్ములను ఇట్టి దురవస్థలో నేలపైపడియుండుటను చూడ లేకున్నాను. ఇట్టి మీ అవస్థను దుర్యోధనుడు చూడకుండుటచే అతని మరణము శ్రేష్ఠమైనదిగా భావించుచున్నాను. పరలోకమందు కూడా పాపపరిహారమునకు యోగ్యముగ ఉపదేశించవలసినదని యుధిష్ఠిరుడు ప్రార్థించెను. అంతట భీష్ముడు గౌతమియను వృద్ధబ్రాహ్మణి, అర్జునకుడను వ్యాధుడు, సర్పము, మృత్యువు కాలముల సంవాద రూప ప్రాచీన ఇతి హాసమును వినిపించి ఇట్లనియె. ఓ రాజా! సమస్త జగత్తు కాల స్వరూపము. నీవు గాని, దుర్యోధనుడుగాని ఏమీచేయలేదు. కాలవశమున సమస్త భూపాలురు మరణించిరి. ఈ భీష్ముని ఉపదేశము వినుటవలన యుధిష్ఠిరుని చింత దూరమైనది. తిరిగి అతడు హితామహా! ధర్మమును ఆశ్రయించుకొని మృత్యువును జయించిన గృహస్థు ఎవరని ప్రశ్నించెను. సమాధానముగా భీష్ముడు అగ్ని పుత్రుడు సుదర్శనుని వృత్తాంతము చెప్పెను. అతడు అతిథి సత్కారముచే మృత్యువును జయించెను. విశ్వామిత్రుడు బ్రాహ్మణత్వము, బ్రహ్మర్షిత్వము పొందిన విధానము చెప్పుచు అతని జన్మవృత్తాంతము వివరించెను. ఇంద్రుడు, చిలుక సంవాదము ద్వారా దయాళురు, భక్త పురుషుల గుణ గణములను వర్ణించెను. వశిష్ఠ బ్రహ్మల సంవాదము ద్వారా దైవముకంటె పురుషప్రయత్నము గొప్పతనమును వివరించెను. యుధిష్ఠిరుడు అడుగగా భీష్ముడు కర్మఫలమును, పూజ్యులు, నమస్కార యోగ్యులగు పురుషులగుణములను వర్ణించెను. నక్క కోతి సంవాదమును వినిపించి, బ్రాహ్మణులకు దానమీయుట వలన దేవతలు, పితృదేవతలు

తృప్తిపడెదరు. కనుక బుద్ధిమంతుడగు పురుషుడు బ్రాహ్మణులకు తప్పక దానము చేయవలెనని ఉపదేశించెను. శూద్ర, తపస్వి బ్రాహ్మణ కథ చెప్పి అనధికారికి
ఉపదేశించుట కష్టావహమని పేర్కొనెను. లక్ష్మి ఎవరివద్ద నివసించునో, ఎవరి వద్ద ఉండదో వివరించెను. భంగాస్వనుడను రాజర్షి వృత్తాంతము ద్వారా విషయ భోగమందు పురుషుని కంటె స్త్రీలకే ఎక్కువ సుఖము లభించునని చెప్పెను.

భీష్ముడు ధర్మరాజుతో రాజా! ఇతరులకు ప్రాణహాని కల్గించుట, దొంగతనము చేయుట, పరదారాభిగమనము ఈమూడు శారీరక పాపములు. చెడుమాటలు మాట్లాడుట, పరుష వచనము, పిశునత్వము, అసత్యభాషణము, ఈనాలుగు వాక్కునకు సంబంధించిన పాపములు, ఇతరుల సంపదను ఆశపడుట, అందరితోను విరోధము, కర్మ ఫలము మీద విశ్వాసము లేక పోవుట ఈ మూడు మానసిక పాపములు. శారీరక, వాచిక, మానసిక పాపములను విడిచి పెట్టవలెను. యుధిష్ఠిరుడు అడుగగా భీష్ముడు శంకరుని మాహాత్మ్యమును వర్ణించమని శ్రీకృష్ణుని కోరెను. శ్రీకృష్ణుడు శివుని గొప్పతనమును, గుణగణములను వర్ణించెను. వాసుదేవుడు శివసహస్రనామస్తోత్రపాఠము యొక్క ఫలితమును వివరించుచు ఎవరైతే నియమ నిష్ఠలతో శివస్తోత్రమును పఠించెదరో వారికి అశ్వమేధ యజ్ఞము చేసినంత ఫలము లభించునని చెప్పెను. వ్యాసమహర్షి యుధిష్ఠిరునికి శివసహస్రనామ స్తోత్రము పఠించమని ఉపదేశించెను. యుధిష్ఠిరుడు భీష్ముని భరతశ్రేష్ఠ! స్త్రీలకు వివాహకాలమున సహ ధర్మము గూర్చి చెప్పబడుచున్నది. అది యెట్లు సంగతమగును. భార్యాభర్తలతో ఒకరు ముందు మరణించిన ఒక వ్యక్తియందు సహధర్మము ఎట్లు ఉపపన్నమగునని ప్రశ్నించెను. దీనికి సమాధానముగా భీష్ముడు అష్టావక్రముని, ఉత్తర దిక్కుల సంవాదము వినిపించెను. స్వర్గగామి, నరకగామి మనుష్యుల లక్షణములను చెప్పెను. విభిన్న తీర్థముల మహిమను వర్ణించెను. నానావిధ ఉపాఖ్యానముల ద్వారా బ్రాహ్మణత్వప్రాప్తికి ఉపాయము చెప్పెను. శ్రీకృష్ణభగవానుడు, నారద మహర్షుల సంవాదము ద్వారా ముల్లోకములలోనూ పూజ్యులగు పురుషుల పరిచయము చేసెను. స్త్రీలను రక్షించెడి విషయమై వేరు వేరు సంవాదములను వినిపించెను. కన్యాదానమునకు యోగ్యవ్యక్తి విచారణ

చేసెను. బ్రాహ్మణాది చాతుర్వర్ణ్యసంతతికి తండ్రి ఆస్తి పంచు విధానము పేర్కొనబడినది. యుధిష్ఠిరుడు అడుగగా భీష్ముడు వర్ణసాంకర్యమును గూర్చి విస్తృతముగ పరిచయము చేసెను. గోవుల మహత్త్వమును వర్ణించు సందర్భమున చ్యవన నహుషుల సంవాదము వినిపించెను.

యుధిష్ఠిరుడు భీష్ముని పితామహా! రాజ్యాధికారము పొందుటకు మేము అసంఖ్యాక పురుషులను చంపితిమి. ఈ కారణంచేత మేము తప్పక నరకమున
పడెదము, కనుక నాశరీరమును కఠోరతపస్సు ద్వారా శుష్కింప చేయదలచుకొంటిని. ఈసందర్భమున తగిన ఉపదేశము చేయుమని కోరెను. భీష్ముడు ధర్మరాజునకు మనిషిమరణించిన తరువాత ఏయే కర్మలవలన ఎటువంటి గతి లభించునో చెప్పెను. తోటలు, జలాశయములు మున్నగునవి నిర్మించుటవలన కల్గు ఫలమును వివరించెను. దానము, యజ్ఞము చేయుట క్షత్రియుని ప్రధాన కర్తవ్యము, రాజు ఎల్లప్పుడు ప్రజలను రక్షించవలెను. రాజుచేరక్షింపబడని ప్రజలు పాపము చేసిన అందు నాల్గవ భాగము రాజుకు చెందును. అట్లే రాజుచే రక్షింపబడు ప్రజలు పుణ్యము చేసిన అందు నాల్గవ భాగము రాజునకు చెందును. అన్నిదానములకన్న భూదానము మిన్నయని ఉపదేశించెను. యుధిష్ఠిరుడు భీష్ముని బ్రాహ్మణులకు ఏయే వస్తువులు దానము చేయవచ్చును. వాటి ఫలమేమని ప్రశ్నించ భీష్ముడు అన్నదాన మాహాత్మ్యమును చెప్పెను. మంగళము కోరువ్యక్తి అన్నార్థి యైన వ్యక్తికి అన్నదానము చేయవలెను. ఇంటికి వచ్చిన వారినెవ్వరిని అవమానము చేయకూడదు. చండాలుడు లేదా కుక్కకు చేసిన అన్నదానము కూడా వ్యర్థము కాదని వివరించెను. విభిన్న నక్షత్రముల యోగమున భిన్నభిన్న వస్తువులదాన ప్రక్రియను స్పష్టము చేసెను. చెప్పులు, శకటము, నూనె, భూమి మున్నగు వస్తువుల దానమహిమను పేర్కొనెను. బ్రాహ్మణయమ సంవాదము ద్వారా తిలలు, జలము, దీపము, రత్నము మున్నగు వస్తువులు దానము చేయుట వలన కల్గు ఫలము చెప్పెను. నృగరాజు ఉపాఖ్యానము చెప్పి బ్రాహ్మణధనమును ఎన్నడు అపహరించరాదని ఉపదేశించెను. ఉద్దాలక నచికేతోపాఖ్యానము ద్వారా గోదానమహిమను స్పష్టము చేసెను. గోహత్య చేయువారు లేక గోమాంసము తిన్నవారు లేక గోహత్యకు ఆమోదము తెలుపువారు గోశరీరమందు ఎన్ని

రోమములుండునో అన్నిసంవత్సరములు నరకమున పడెదరని తెలిపెను. విధిపూర్వకముగా సువర్ణమును దానము చేసిన లభించు వేదోక్త ఫలమును చెప్పెను. తారకాసుర వధవృత్తాంతమును వినిపించెను. శ్రాద్ధవిధి, అందు దానయోగ్యములగు వస్తువుల పరిచయము చేసెను.

శ్రీ కృష్ణభగవానుడు, పృధ్వి సంవాదము ద్వారా గృహస్థ ధర్మములనుపదేశించెను. తల్లి, తండ్రి, ఆచార్యుడు మున్నగు వారిని గౌరవించు ప్రకారము తెలియజేసెను. ఈసందర్భమున భీష్ముడు పది మంది ఆచార్యులనుమించి ఉపాధ్యాయుడు, పదిమంది ఉపాధ్యాయులను మించి తండ్రి , పది మంది తండ్రులను మించి నది తల్లి. ఆమె తన గౌరవముతో సమస్త భూమండలమునే తిరస్కరించును.
కనుక తల్లితో సమానమైన గురువు లేడు. తండ్రిమరణించిన పెద్దసోదరుని తండ్రివలె భావించవలెను. తల్లిదండ్రులు కేవలము శరీరము నిచ్చెదరు. ఆచార్యుడు జ్ఞానోపదేశము చేయును. జ్యేష్ఠసోదరి, జ్యేష్ఠసోదరుని భార్య తల్లితో సమానమని తెలియజెప్పెను.

యుధిష్ఠిరుని ప్రశ్నకు సమాధానముగా భీష్ముడు ఉపవాసవ్రతము, వాటి ఫలములను వివరించెను. అహింసను ప్రశంసిస్తూ అది ఉత్కృష్ట ధర్మము, ఉత్కృష్ట, సంయమము, పరమదానము, పరమ తపస్సు. అహింస శ్రేష్ఠమగు యజ్ఞము. శ్రేష్ఠ ఫలము అహింస చక్కని స్నేహితుడు పరమ సుఖమని చెప్పెను. విభిన్న సంవాదముల ద్వారా ధర్మ రహస్యమును చెప్పెను. విష్ణుసహస్రనామ స్తోత్రమహిమను పఠించుట వలన కల్గు ఫలమును వివరించెను. శ్రీకృష్ణుని మహిమను వర్ణించెను. యుధిష్ఠిరుడు అడుగగా శ్రీ కృష్ణుడు శంకరుని మహత్త్వమును వివరించెను. ఈ విధముగా భీష్ముడు యుధిష్ఠిరుని సంశయములను నివృత్తి చేసెను. పిమ్మట ధర్మరాజు భీష్ముని అనుమతి పొంది సపరివారము హస్తినకు వెడలెను.

**2) భీష్మ స్వర్గారోహణ పర్వము:-**

హస్తినాపురము వెళ్ళిన తరువాత ధర్మరాజు అందరిని యథోచితముగా సత్కరించి వారిని ఇండ్లకు పంపెను. అతడు భీష్ముని మాటలను స్మరించెను. సూర్య భగవానుడు దక్షిణాయనమునుండి మరలి ఉత్తరాయణమునకు బయలు దేరినపుడు యుధిష్ఠిరుడు యాజకులతో

హస్తినాపురము నుండి బయలుదేరెను. భీష్ముని సంస్కారమునకు అమూల్యమగు వస్తువులను పంపెను. యుధిష్ఠిర, ధృతరాష్ట్ర, గాంధారి, కుంతి, పాండవులతో కలిసి శ్రీ కృష్ణ, విదుర, యుయుత్సు, సాత్యకులు భీష్ముని వద్దకు వెళ్ళిరి. ఇతర రాజులు కూడా అక్కడకు వచ్చిరి. బాణశయ్యపై పరుండిన భీష్మునికి ప్రణామము చేసి యుధిష్ఠిరుడు పితామహా! మేమందరము మీసేవకు వచ్చితిమి. కళ్ళు తెరిచి చూడుడు. మీరు చెప్పిన ప్రకారము అవసరమగు వస్తువులన్నియు తెప్పించితినని పలుకగా భీష్ముడు కండ్లుతెరచి అచ్చట నున్న భరత వంశీయులందరిని చూచెను. యుధిష్ఠిరుని చేయిపట్టుకొని నరశ్రేష్ఠ! సౌభాగ్యము వలన మీరంతా వచ్చితిరి. సూర్యుడు దక్షిణాయనము నుండి ఉత్తరాయణమునకు మరలెను. బాణశయ్యపైనుండి ఇప్పటికి 58 రోజులు అయినవి. చాంద్రమానము ప్రకారము మాఘమాసము వచ్చినది. శుక్ల పక్షము ఒక భాగముగడిచి మూడు భాగములు మిగిలియున్నవి. (మాఘ శుక్ల అష్టమి). పిమ్మట ధృతరాష్ట్రుని పిలిచి రాజా! వేదశాస్త్ర
రహస్యములను నీవు సంపూర్ణముగా తెలిసినవాడవు. జరిగిన సంఘటనలకు శోకించవలదు. పాండవులు కూడా నీకు పుత్రులువంటివారే పుత్రులు వలె వారిని పాలింపుము. నీపుత్రులు దురాత్ములు, వారి గురించి శోకించుట తగదని. చెప్పెను. శ్రీకృష్ణ భగవానునితో భగవంతుడా! మీకు నమస్కారము, నన్ను రక్షింపుడు. ఇహ లోకము నుండి వెళ్ళుటకు అనుమతినీయవలసినది. మీరు పురాతన ఋషి నారాయణుడుగా తెలుసుకొనుచున్నాను. శరీరత్యాగమునకు అనుమతినీయవలసినదని ప్రార్థించెను. శ్రీకృష్ణుడు "మీకు అనుమతి నిచ్చుచున్నాను మీరు వసులోకమునకు వెళ్ళుడు. మీరు ఎట్టి పాపము చేయలే"దని భీష్ముని అనుగ్రహించెను. భీష్ముడు పాండవులను మిగిలిన వారిని దేహత్యాగమునకు అనుమతి కోరుచు మీరు ఎల్లప్పుడు సత్య ధర్మములను పాలింపుడు. సత్యమే అన్నిటి కంటె గొప్పది. అని పలికెను. ఋత్విక్కులను, ఆచార్యులను ఎల్లప్పుడు పూజించమని యుధిష్ఠిరునకు ఉపదేశించి భీష్ముడు రెండు క్షణములు మౌనము వహించెను. యోగమార్గము ద్వారా అతని ప్రాణములు పైకి వెడలినవి. భీష్ముని ప్రాణములు ఏయే అవయవములను విడిచి వెళ్ళుచున్నవో ఆయా అవయవముల నుండి బాణములు స్వయముగ తొలగుచు గాయములు

పూడి పోవుటను వ్యాసాది మహర్షులు ఆశ్చర్యముగా చూసిరి. క్షణకాలములోనే అతని శరీరము బాణములు లేని దాయెను. యోగశక్తితో ఇంద్రియద్వారములను బంధించుటచే శిరస్సు బద్దలు చేసికొని ప్రాణములు ఆకాశమునకు వెడలినవి. పాండవులు విధిపూర్వకముగ దహన సంస్కారములు నిర్వ ర్తించిరి. పుత్రశోకంతో విషణ్ణురాలగు గంగాదేవిని శ్రీకృష్ణ భగవానుడు, వ్యాసమహర్షి ఓదార్చిరి.

**ఇది అనుశాసనపర్వ కథాంశము.**